బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న రాము

మన్సూరాబాద్: ఆపదలో ఉన్న వారికి చేయూతనివ్వాలని సామాజిక కార్యకర్త, రైస్ ఏటీఎం నిర్వాహకుడు దోసపాటి రాము అన్నారు. నాగోలు డివిజన్ పరిధి రాక్‌హిల్స్‌కాలనీలోని రైస్ ఏటీఎం వద్ద శనివారం పేదలకు బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలిసిన వాళ్లు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి భరోసా కల్పించాలని కోరారు.

దోమల బెడదను నివారించండి

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలో మూసీ పరీవాహక ప్రాంతాల్లో దోమల బెడద లేకుండా చేయాలని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో సీనియర్ ఎంటమాలజీ జోనల్ హెడ్ రజినీ, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కొత్తపేట డివిజన్ పరిధిలో మూసీ ప్రవహిస్తుండటంతో దోమల బెడదతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాలనీలో ఫాగింగ్ చేయడం లేదని, దోమ కాట్లతో వివిధ రోగాలబారిన పడుతున్నారన్నారు. ప్రతి రోజూ ఫాగింగ్ చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఎల్‌బీనగర్: సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గాయత్రినగర్ ఫేజ్–2 సంక్షేమ సంఘం నాయకులు శనివారం కార్పొరేటర్‌ను తన కార్యాలయంలో కలిసి కాలనీల సమస్యలపై వినతి పత్రం అందజేశారు.అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ..కాలనీలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో రమేష్‌కుమార్, రామకృష్ణగౌడ్, శ్రీ రాములు గౌడ్ ఉన్నారు.

యాసిడ్ దాడి దుండగుడిపై చర్యలు తీసుకోవాలి

సైదాబాద్: పెద్దతోట శ్రీభూలక్ష్మీ మాత ఆలయంలో అకౌంటెంట్‌పై యాసిడ్ దాడి చేసిన దుండగుడిపై చర్యలు తీసుకోవాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈ ఆలయంలో అకౌంటెంట్‌పై యాసిడ్ దాడి ఘటన కలకలం రేపింది. సమాచారం అందుకున్న కార్పొరేటర్ శనివారం డివిజన్ బీజేపీ నాయకులతో కలిసి ఆలయానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్‌ను ఆయన కార్యాలయానికి వెళ్లి దుండగుడిని గుర్తించి అరెస్ట్ చేయాలని కోరారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

మలక్‌పేట: సాంకేతిక నైపుణ్యాలు మెరుగుపర్చుకునే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సైదాబాద్ మండల డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ తిరునగరి రాధాకృష్ణ అన్నారు. తెలంగాణ విద్యాశాఖ ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా భాషా, గణిత నైపుణ్యాలు సాధించేందుకు ఏఐ సాయంతో ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు శిక్షణ ఇవ్వాడానికి మలక్‌పేట పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, హిమాయత్ నగర్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ విజయలక్ష్మి, డిప్యూటీ ఐఓఎస్ అస్రా ఫాతిమా, ప్రాథమిక స్కూల్ హెచ్ శ్రీనివాస్, ల్యాబ్ ఇన్‌చార్జి సునీత పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి

చాదర్‌ఘాట్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను మలక్‌పేట నల్గొండ చౌరస్తాలో దహనం చేసి కించపరిచేలా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్ చాదర్‌ఘాట్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గౌరవప్రదమైన హోదాలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కించపరిచే విధంగా వ్యవహరించిన బీఆర్‌ఎస్ నాయకులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కిషన్‌సింగ్, మహమ్మద్ షకీల్, సాయి, లింగాల శ్రీనివాస్‌గౌడ్, రాహుల్ సింగ్, రోహిత్, షాహిద్‌ఖాన్, వికాస్, భాస్కర్ పాల్గొన్నారు.

మెట్ల బావులు.. పునరుద్ధరిస్తే మేలు



సహారాస్టేట్స్ కాలనీ బహార్ బ్లాక్ వద్ద శిథిలావస్థలో మెట్లబావి

- శిథిలావస్థకు చేరుతున్న వైనం
- అభివృద్ధి చేయాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు

మన్సూరాబాద్: నాడు తాగు, సాగు నిరందించే మెట్లబావులు నేడు జీర్ణావస్థలో ఉన్నాయి. పూర్తిగా రాయితో సుందరంగా నిర్మించిన బావులు కనుమరుగవుతున్నాయి. వారసత్వ కట్టడాలను రక్షించుకోవటంలో ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మన్సూరాబాద్ డివిజన్ సహారాస్టేట్స్‌కాలనీలో రెండు పురాతన మెట్ల బావులున్నాయి. సహారాస్టేట్స్‌కాలనీ నాడు దట్టమైన అడవి ప్రాంతం కావడంతో నాటి పాలకులు పర్యాటకం, వ్యవసాయానికి అనువుగా మెట్లబావులను సుందరంగా నిర్మించారు. కాలనీలో కమ్యూనిటీహాల్‌లో మెట్లబావిపైనే లలితా నాగలింగేశ్వరస్వామి స్వయంభూగా వెలువడంతో ఆలయంను నిర్మించారు. మరొకటి సహారా బహార్ 10బ్లాక్ వద్ద నిర్మించారు. అది కూడ నేడు శిథిలావస్థలో ఉంది. నేడు మెట్లబావులు శిథిలావస్థలో ఉండి డ్రైనేజీ మురుగుతో దుర్వాసనను వెదజల్లుతున్నాయి. ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు జోక్యం చేసుకుని మెట్లబావులను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

గతంలో పరిశీలించారు..

గతంలో సాక్షిలో ప్రచురితమైన కథనంతో ఓ కార్పొరేట్ సంస్థ స్పందించి ఆర్కియాలజీ సిబ్బందితో సంస్థ ప్రతినిధుల బృందం మెట్లబావులను పరిశీలించి పునరుద్ధరణ చర్యలు చేపడుతామన్నారు. ప్రభుత్వం మారడంతో పునరుద్ధరణలో జాప్యం ఏర్పడుతుంది. ప్రతినిధుల బృందం పరిశీలించి ఏళ్లు గడుస్తున్న ఏలాంటి చర్యలు చేపట్టకపోవడంతో కాలనీవాసుల్లో అయోమయం నెలకొంది.పత్రికల్లో ప్రచురితం అయినప్పుడు మాత్రమే హడావుడి చేసే ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ తర్వాత మెట్లబావులపై చొరవ తీసుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



లలితానాగలింగేశ్వరస్వామి దేవాలయం వద్దనున్న మెట్లబావి

అభివృద్ధి చేయాలి



నాటి పాలకులు ఎంతో సుందరంగా నిర్మించిన మెట్లబావులు కాలక్రమేణా శిథిలావస్థలో ఉన్నాయి. కాలనీలో శిథిలావస్థలో ఉన్న మెట్లబావులను అభివృద్ధి చేయాలి. కాలనీలో రెండు మెట్లబావులుండటం అదృష్టంగా భావిస్తున్నాం. ప్రభుత్వం స్పందించి మెట్లబావులపై దృష్టి సారించాలి. రెండు బావులను పునరుద్ధరిస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్న ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

గంగదాసు కృష్ణారెడ్డి, సహారాస్టేట్స్‌కాలనీవాసి

డ్రైనేజీ కంపుతో దుర్వాసన



నాటి మెట్లబావులు శిథిలావస్థలో ఉన్నాయి. వర్షపునీరు చేరి దుర్గంధంలో దుర్వాసన వస్తుంది. ఒక మెట్లబావిపై నాగలింగేశ్వరస్వామి వెలువడంతో చిన్న దేవాలయం నిర్మించాం. మెట్లబావులో పూడికతీస్తే బావుల్లోకి నీరు చేరే అవకాశం ఉంది. ప్రజాప్రతినిధులు, కార్పొరేట్ సంస్థలు స్పందించి మెట్లబావుల పునరుద్ధరించాలి.

మేకల వెంకట్‌రెడ్డి,
సహారాస్టేట్స్‌కాలనీ దేవాలయ కమిటీ సభ్యుడు

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.11, వంకాయ రూ.18, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.08, క్యారెట్ రూ.15, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.21, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.18, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.31. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

అల్పాహారం అందజేత



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం చిత్రలేవుట్ కాలనీని చెందిన ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్, లయన్స్ క్లబ్ వనస్థలి క్రాంతి ఆధ్వర్యంలో వనస్థలిపురంలోని శాంతినికేతన్ ఫౌండేషన్ వారు నిర్వహిస్తున్న మానసిక వికలాంగులకు శనివారం అల్పాహారం ఏర్పాటు చేశారు. ట్రస్ట్ చైర్మన్ సంతాపూర్ రామచంద్ర రావు,శోభ దంపతుల వారి మనవడు జన్మదినం సందర్భగా అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామచంద్ర రావు మాట్లాడుతూ.. ట్రస్ట్ ద్వారా గత రెండు దశాబ్దాలుగా సమాజ సేవ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సాధుశ్యాంప్రసాద్, మూర్తి వాసుదేవరావు, మారంరాజు రామచంద్ర రావు, నందిరాజు, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి వినతి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సంస్థ సభ్యులు

మలక్‌పేట: సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో ఉన్న అంధుల ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాన్ని మూసివేసే ప్రయత్నాన్ని ఆపాలని కోరుతూ ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ ది డిసెబుల్డ్ (ఫెడ్) ఆధ్వర్యంలో పలువురు నాయకులు శనివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని విజ్ఞప్తి చేసినట్లు ఫెడ్ చైర్మన్ గంగారామ్, సెక్రటరీ చెరుకు నాగభూషణం తెలిపారు. ఎన్ఐవీహెచ్, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ఈ కేంద్రం ద్వారా గత 30 సంవత్సరాలకు పైగా ఎంతో మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మధ్య కాలంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో నియామకాల్లో 150 మంది ఇందులో శిక్షణ పొందిన వారికే ఉద్యోగాలు లభించాయని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కేంద్రం కార్యకలాపాలు నిలిచిపోవడంతో అంధ విద్యార్థులకు ప్రత్యేక విద్యాబోధన అందకుండా పోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఎన్ఐవీహెచ్ సంస్థ ద్వారా యథావిధిగా శిక్షణ కేంద్రాన్ని నడుపాలని కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చామన్నారు. మంత్రిని కలిసిన గోపాల్‌రావు, గంగాధర్, మహేష్, ఆనిల్ శేషారావు ఉన్నారు.

రాచ కాలువకు హద్దులు ఏర్పాటు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: రాచ కాలువ ఎంతో ప్రాచీనమైన కాలువ అని, నిజం కాలంలో వ్యవసాయం కోసం తుర్కయంజాల్ మాసాబ్ చెరువు నుంచి హయత్‌నగర్ కుమ్మరి కుంట వరకు కాలువను నిర్మించారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు.రాచకాల్వ సర్వేపై శనివారం ఆయన తన కార్యాలయంలో హయత్‌నగర్ తహసీల్దార్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాచ కాలువ సాహెబ్‌నగర్ కలాన్, హయత్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో కబ్జాకు గురైందని, కాలువకు ఆనుకుని గ్రామ పంచాయతీ వెంచర్లు, పెద్ద పెద్ద భవన నిర్మాణాలు జరిగాయని కొన్ని చోట్ల రియల్ వ్యాపారులు కాలువను తమ వెంచర్లలో కలిపేసుకున్నారని ఆరోపించారు. కాలువను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ జానకి, ఇరిగేషన్ డీఈ శుక్లజ, ఏఈ సతీష్, సర్వేయర్ జ్యోతి, నాయకులు కటికరెడ్డి అరవిందొరెడ్డి, గొరిశెట్టి మనోజ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నాను విజయవంతం చేయండి

సీపీఎం మండల కార్యదర్శి శేఖర్

మహేశ్వరం: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17, 18 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ఎదుట నిర్వహిస్తున్న ధర్నా, వంటావార్పు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల శేఖర్ కోరారు. శనివారం మండల కేంద్రంలో సీడీపీఓ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా, వంటావార్పు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎం శ్రీ పథకాన్ని, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను వెంటనే రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యా విధానం చట్టాన్ని అమలు చేయకుండా ఆపాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆయా నిరసన కార్యక్రమాల్లో ప్రతీ అంగన్‌వాడీ టీచర్, హెల్పర్లు అధిక సంఖ్య లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు మండల కేంద్రంలో ఐసీడీఎస్ కార్యాలయంలో అధికారులకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

వృద్ధుడి హత్య కేసులో ఇద్దరి రిమాండ్

సంతోష్‌నగర్: వృద్ధుడి హత్య కేసులో ఇద్దరిని కంచన్‌బాగ్ పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో చాంద్రాయణగుట్ట ఏసీపీ మనోజ్‌కుమార్, కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డితో కలిసి నిందితుల వివరాలను వెల్లడించారు. వివరాల ప్రకారం..హఫీజ్‌బాబానగర్ సీ–బ్లాక్ ప్రాంతానికి చెందిన జాకీర్ ఖాన్ (62) స్థానికంగా కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఈ దుకాణానికి పక్కనే ఫహీం, అజీమ్ అల్–అరబిక్ పాన్‌షాపు నిర్వహిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం కిరాణా దుకాణం ముందు కుర్చీలు వేసి ఇబ్బందులకు గురి చేయడంతో జాకీర్ ఖాన్ పలుమార్లు ఫహీం, అజీమ్‌ను మందలించాడు. ఇందులో భాగంగా ఈ నెల 12న రాత్రి 11:55 గంటల సమయంలో ఫహీం, అజీమ్ మరోసారి జాకీర్ ఖాన్ కిరాణా దుకాణం ముందు కుర్చీలు వేసుకొని ఉండటంతో తన గిరాకీ దెబ్బతింటుందని.. కుర్చీలను తీసి పక్కకు పడేశాడు. దీంతో పాన్‌షాపు నిర్వాహకులు హాఫీజ్ బాబానగర్‌కు చెందిన ఫహీం (24), అజీమ్ ఆగ్రహానికి గురై ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగిన జాకీర్ ఖాన్‌పై దాడి చేశారు. ఈ విషయం తెలుసుకున్న కుమారులు జూబేర్, జీషాన్ ఘటనా స్థలానికి చేరుకొని వారిని నిలదీయగా వారిపై సైతం దాడికి పాల్పడ్డాడు. అనంతరం జాకీర్ ఖాన్‌ను చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. జాకీర్ కుమారుడు జూబేర్ ఖాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని శనివారం ఫహీం, అజీమ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో కుర్షన్‌తో పాటు మరికొంత మంది నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



అమీనా ఫాతిమా

హస్తినాపురం: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రవి వివరాల ప్రకారం.. శక్తినగర్, చింతల్‌కుంటలో ఉంటున్న అమీనా ఫాతిమా(28)ను ఏదైనా పనిచేయాలని తల్లి చెప్పడంతో ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లింది.రాత్రైనా రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆఫీస్‌కు వెళ్లిన యువకుడు..



నరేశ్

హస్తినాపురం నాగార్జున కాలనీకి చెందిన భీమగాని నరేశ్(25) ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 12న ఆఫీస్‌కు వెళ్తున్నాని చెప్పి ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన నరేశ్ ఎంతకీ రాకపోవడంతో తండ్రి కిషన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం దేవాలయంలో మూల మంత్ర జపాలు, మండప పూజలు, విశేష అభిషేకం, చండీ హోమం , ప్రదోష పూజలు, రుద్రహోమం, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ తరగతులు

చైతన్యపురి: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారి కోసం దిల్‌సుఖ్‌నగర్‌లోని కేవీఆర్ స్పోకెన్ ఇంగ్లిష్ సెంటర్‌లో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ కేవీఆర్ ఓ ప్రకటనలో తెలిపారు. గండి జగన్ యాదవ్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించే తరగతులు గ్రూప్స్, బ్యాంక్ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి దోహదపడుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 20లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9030353247 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

రేషన్ బియ్యం విక్రేతల అరెస్టు



శ్రీను, రాము

హయత్‌నగర్: రేషన్‌బియ్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసిన ఘటన హయత్‌నగర్ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హయత్‌నగర్ బంజారాకాలనీకి చెందిన మెగావత్ శ్రీను, కనావత్ రాములు పరిసర ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్మేందుకు 7 క్వింటాళ్ల బియ్యాన్ని ఆటోలో తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఇంజాపూర్–తొర్రూర్ దారిలో ఆటోను తనిఖీ చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

118 జీఓ పేరుతో చెల్లని కాగితం ఇచ్చారు



కాలనీ వాసులతో మాట్లాడుతున్న మధుయాష్కిగౌడ్

ఎల్‌బీనగర్: ఓట్ల కోసం 118జీఓ పేరిట చెల్లని కాగితాన్ని చేతులో పెటి బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వాసులను మోసం చేశారని, ఇప్పటికే అదే జీఓను ఇప్పిస్తానంటూ మాయమాటాలు చెప్పడం విడ్డూరంగా ఉందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కిగౌడ్ అన్నారు.శనివారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఫేజ్–3 హెచ్ఎండీఏ పార్కు, ఆడిటోరియం సమీపంలో ఉన్న పార్కును సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మధు యాష్కి గౌడ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో సీఎం ఫొటో పెట్టి పనికిరాని కన్వీనెన్స్ డీడ్ ఇవ్వడం దుర్మార్గమని, చట్ట ప్రకారం అది ఎక్కడా చెల్లదన్నారు. పార్కుల గేట్లకు తాళాలు వేసి ప్రారంభంతో జాప్యం చేస్తున్నారని ఎమ్మెల్యే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎక్కడ కూడా పార్కులకు తాళాలు వేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు సదాశివుడు, అశోక్‌గౌడ్, రామరావు, బుద్ధ సత్యనారాయణ, నర్సింహాయాదవ్, గణేష్‌రెడ్డి, రామకృష్ణరెడ్డి, వినయ్ పటేల్, గోపిరెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పఠనా సామర్థ్యాలు మెరుగుపర్చడమే లక్ష్యం



ఏఐ కోర్సును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అరుణ

నాగోలు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పఠనా సామర్థ్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ (ఏఐ)ని ప్రవేశ పెట్టినట్లు మేడ్చల్ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రవీందర్ రాజు, ఉప్పల్ మండల విద్యాశాఖాధికారి రామారావు అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని జైపురికాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ (ఏఐ) కోర్సును శనివారం ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విద్యాశాఖ అధికారులు, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ, నోడల్ అధికారి నాగోల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్ ద్వారా విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి విద్యను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని వివిధ మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్ ద్వారా ఇప్పటికే 6 పాఠశాలల్లో ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు అనంతరెడ్డి, మేరీబ్యూల, మల్లేష్, రమాదేవి, సుధారాణి ఆకృతి ప్రాజెక్టు ప్రతినిధులు సబిత, సీమ, భరత్ పాల్గొన్నారు.

అద్దె మైదానమే దిక్కు



షాహిన్‌నగర్‌లో అద్దె ఆట మైదానం

పహాడీషరీఫ్: అద్దెకు కాదేదీ అనర్హం అన్నట్లు క్రీడా మైదానాలు పుట్టుకొచ్చాయి. జల్‌పల్లి మున్సిపాలిటీలో అందుబాటులోకి వచ్చాయి. వస్తున్నాయి. క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్ లాంటి ఆటలు ఆడుకునేందుకు బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌లు భారీగా ఏర్పాటవుతున్నాయి. ప్రభుత్వ క్రీడా మైదానాలు లేకపోవడంతో యువత వీటిని ఆశ్రయిస్తున్నారు. ఆటలపై ఉన్న ఆసక్తితో గత్యంతరం లేని పరిస్థితుల్లో డబ్బులు చెల్లించి ఆడుకోవాల్సిన దుస్థితి కలిగింది. ఇక ఏదైనా పెద్ద టోర్నమెంట్ నిర్వహించుకోవాలంటే మైదానం వెతుక్కోవడం పైనే ప్రత్యేక ధ్యాస పెట్టాల్సి రావడం గమనార్హం. పహాడీషరీఫ్‌లో గతంలో కుస్తీ పోటీల మైదానం కోసం నిర్వాహకులు పడిన పాట్లు అన్నీ ఇన్నీ కావు. పోలీస్‌గ్రౌండ్‌లో పోటీలకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో.. చివరి క్షణంలో ప్రైవేట్ స్థలాన్ని ఎంచుకోవాల్సి వచ్చింది.

విన్నపాలు.. బుట్టదాఖలు

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ భూములను మైదానాల కోసం కేటాయించాలని పుర ప్రజలు పలుమార్లు ప్రజాప్రతినిధులకు విన్నవించంచారు. ఇంతకాలం స్థానిక యువతీయువకులు.. పహాడీషరీఫ్‌లోని ఇజ్తెమా గ్రౌండ్, జల్‌పల్లి మంచు టౌన్ షిప్ రోడ్డులోని ప్రైవేట్ స్థలాల్లో ఆడుతూ వచ్చారు. కానీ ప్రస్తుతం నిర్మాణ రంగం ఊపందుకొని ఖాళీ స్థలాలు కనిపించకుండా పోయాయి. దీంతో ప్రభుత్వం తరపున క్రీడా మైదానాలను కేటాయించాల్సిన అవసరం ఏర్పడింది. ఏడాదికోసారి క్రికెట్, వాలీబాల్ లాంటి టోర్నమెంట్‌లు నిర్వహించాలనుకున్నా మైదానాలు లేని కారణంగా ప్రైవేట్ భూములను ఆశ్రయిస్తూ చీదరింపుల పాలవ్వాల్సి వస్తుందని పలువురు నిర్వాహకులు పేర్కొంటున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515
9912220363
9912220365